సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



వారిద్దరూ తోడు దొంగలు

చంద్రబాబు, రామోజీరావు తోడు దొంగలని, కేసుల్లో ఇరుక్కున్నప్పుడే దళితులు గుర్తొస్తారని మంత్రి నాగార్జున ఆరోపించారు. 8లో



రామయ్య చేతికి రాజ్యాధికారం

శ్రీరామగిరి రామనామ స్మరణతో మార్మోగింది. స్వామివారి కల్యాణ వేడుక తదుపరి ఘట్టం నేత్రపర్వంగా జరిగింది. 8లో



మూడు బైక్‌ల దగ్ధం

రాజేంద్రపాలెం రామకృష్ణ మెకానిక్ షాపు బయట ఉంచిన మూడు బైక్‌లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. 8లో

ఆ గ్రామానికి ఏమైంది?

కిండలం.. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఈ గ్రామంలో సంభవించిన వరుస మరణాలు గ్రామస్తులను ఆందోళనకు గురిచేశాయి. సహజ మరణాలే అయినప్పటికీ పదిరోజుల వ్యవధిలో ఏడుగురు మృతి చెందడంతో భయంతో గడుపుతున్నారు. చాలా మంది పక్క గ్రామాలకు బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. గ్రామంలో ఎవరు చనిపోయినా దహన సంస్కారాలకు వెళ్లడం లేదు సరికదా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సహజ మరణాలు కావడం వల్ల ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామాన్ని సందర్శించిన వైద్య బృందాలు, జిల్లా అధికారులు వారికి ధైర్యం చెప్పారు.

- కిండలంలో 10 రోజుల వ్యవధిలో ఏడుగురు మృతి
- వరుస మరణాలతో పక్క గ్రామాలకు వెళ్లిపోతున్న గ్రామస్తులు
- భయం భయంతో బిక్కు బిక్కుమంటున్న గిరిజనులు
- రోజు వారీ వైద్య శిబిరాల ఏర్పాటు
- మూఢ నమ్మకాలు విడనాడాలని వైద్య బృందాల సూచన



కిండలం గ్రామం

పెదబయలు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామంలో అంతుచిక్కని వ్యాధి వల్ల వరుస మరణాలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 350 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఈ నెల 18నుంచి వరుస మరణాలు సంభవించాయి. తొలుత అదేరోజు కిముడు చిన్నమ్మి (65) సాధారణ జ్వరంతో మృతి చెందింది.

- ఈ నెల 19న కిముడు లక్ష్మీనారాయణ, సత్యవతి దంపతులకు చెందిన తొమ్మిది నెలల పసికందు చనిపోయింది.
- ఈ నెల 22న కిముడు బోడంనాయుడు(45) చింతచెట్టు పైనుంచి జారిపడిన వెంటనే పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం పొందుతూ మృతి చెందాడు.
- ఈ నెల 25న కిముడు కృష్ణంనాయుడు (41) రక్తపు వాంతులు చేసుకోవడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించే క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందాడు.
- ఈ నెల 26న కిముడు రాంనాయుడు(58) విచిత్రంగా ప్రవర్తిస్తూ తనకు ఏదో కనిపిస్తుందని భయపడుతూ ఆందోళన చెంది గ్రామంలో మృతి చెందాడు.
- ఇదే లక్షణాలతో ఈ నెల 27న వంచరంగి రామన్నదొర(42), ఈ నెల 29న కునెబేరి ఈశ్వరమ్మ(35) మృతి చెందారు. 10 రోజుల వ్యవధిలో ఏడుగురు ఒకే గ్రామానికి చెందిన వారు మృతి చెందడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు.



ఆందోళన చెందుతున్న కిండలం గ్రామస్తులు

మృతుల ఇళ్లకు రావడానికి జంకుతున్న వైనం..

గ్రామంలో మృతి చెందిన వారి ఇళ్లకు వెళ్లడానికి, దహన సంస్కార కార్యక్రమాలకు గ్రామస్తులు, చుట్టుపక్కల వారు, బంధువులు రావడానికి జంకుతున్నారు. దీంతో కొద్దిమంది మాత్రమే దహన సంస్కార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

- గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 31 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు రోజుల నుంచి ఉపాధ్యాయుడు వస్తున్నా, విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. 56 మంది చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించడం లేదు. ప్రభుత్వ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించాలని యువకులు కోరుతున్నారు.
- గ్రామంలో నాలుగు రోజుల నుంచి వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఎవరిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించడం లేదని వారు చెబుతున్నారు.

భయంతో గడుపుతున్నాం



వారం రోజుల నుంచి భయంతో గడుపుతున్నాం. రాత్రి పూట నిద్ర పట్టడం లేదు. ఆరోగ్యంగా ఉండిన వారు ఒక్క రోజులోనే మృతి చెందడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా మరణాలు ఆగలేదు. దీంతో చాలా మంది పక్క గ్రామాలకు బంధువుల ఇళ్లకు పిల్లలు, మహిళలు వెళ్లిపోయారు. అధికారులు గ్రామస్తుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి సాధారణ స్థాయికి తేవాలి.

– కిముడు చిన్నంనాయుడు, యువకుడు, కిండలం

చనిపోయినా రావడం లేదు



గ్రామంలో వరుస మరణాలతో గ్రామానికి ఏదో గాలి ఆవహించిదని ప్రచారం జరుగుతోంది. దాంతో గ్రామస్తుల్లో ఎవరూ చనిపోయినా దహన సంస్కార కార్యక్రమాలకు రావడం లేదు. వారు కుటుంబీకులు మాత్రమే వెళ్లడం బాధగా ఉంది.

– వంచరంగి కోటిబాబు, గ్రామస్తుడు, కిండలం

ఆందోళన వద్దు

- సహజ మరణాలనేనని వైద్యుల ధ్రువీకరణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- మరణాలకు కారణాలు వెల్లడి

పెదబయలు: మండలంలోని కిండలం గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్నవి సహజ మరణాలని వైద్యులు ధ్రువీకరించారని, గ్రామ ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడురోజులుగా గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం కేజీహెచ్ ప్రత్యేక వైద్య బృందాలు గ్రామాన్ని సందర్శించాయన్నారు. ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించి వారు సూచించిన మందులు వాడటంతో పాటు పొగాకు, తంబాకు, ఖైనీ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. మృతుల్లో 73 ఏళ్ల వ్యక్తి కార్డియోమోగాలి వల్ల చనిపోయారని పెదబయలు వైద్యాధికారి సింధూరం తెలిపారన్నారు. మరొకరు ఈ నెల 26 నుంచి రక్త విరోచనాలతో బాధపడుతూ నాటు వైద్యాన్ని ఆశ్రయించడంతో శ్వాస 18 శాతం పడిపోవడంతో మృతి చెందినట్టు తెలిపారు. హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న మరో వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ప్రాణాలు విడిచినట్టు పెదబయలు వైద్యాధికారులు తెలిపారన్నారు. ఈ నెల 26న గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న మహిళను గుర్తించారన్నారు.

వెంటనే వైద్యం అందించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె నాటువైద్యాన్ని ఆశ్రయించిందన్నారు. వెంటనే వారి బంధువులతో మాట్లాడి చికిత్స అందించడానికి వైద్యసిబ్బంది ప్రయత్నించారన్నారు. వారు వైద్యశిబిరానికి తీసుకురాకుండా ఆమెను ముంచంగిపుట్టు సామాజిక ఆస్పత్రికి తరలించారని, అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారన్నారు. ఆమె న్యూమోనైటిస్‌తో మరణించిందని తెలిపారు. ఎనిమిది నెలల చిన్నారి రెండు రోజులుగా ఎటువంటి ద్రవ పదార్థాలు తీసుకోలేదని తల్లిపాలు తీసుకోకపోవడం వల్ల ఫిట్స్ రావడంతో హైపోగ్లసీమియాతో మృతి చెందిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు.

అన్నీ సహజ మరణాలే..

- ఎక్కువ మందిలో హైపర్ టెన్షన్
- కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్నాథం
- గ్రామాన్ని సందర్శించిన వైద్య బృందాలు
- 53 మంది నుంచి రక్తనమూనాల సేకరణ

పెదబయలు: మండలంలోని కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామంలో ఇప్పటి వరకు సంభవించిన మరణాలు సహజ మరణాలేనని కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్నాథం, కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధూర వెల్లడించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు కిండలం గ్రామంలో కేజీహెచ్, జిల్లా ఆస్పత్రి వైద్య బృందాలు సంయుక్తంగా వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్టు వారు వివరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిశీలించామని, మహిళలు, వృద్ధులు, గర్భిణులు, యువకుల నుంచి 53 రక్త నమూనాలను సేకరించినట్టు చెప్పారు. యువకులకు కూడ హైపర్ టెన్సన్ (బీపీ) ఎక్కువగా ఉందని వెల్లడించారు. ఆహార అలవాట్లు, ఎక్కువగా ఉప్పు తినడం, నీరు ఎక్కువగా తాగకపోవడం, ఇతర చెడు అలవాట్ల వల్ల హైపర్ టెన్సన్ వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని వల్ల గుండెనొప్పితో మృతి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. సేకరించిన రక్తనమూనాలను పరీక్షించిన తరువాత దాని ప్రకారం వైద్యసేవలు అందిస్తామన్నారు. గ్రామంలో వైద్య సిబ్బంది వద్దకు కొద్దిమంది మాత్రమే వస్తున్నారన్నారు. గత మూడు నెలల నుంచి ప్రతీ నెల నాల్గవ సోమవారం కిండలం గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో గర్భిణులు మాత్రమే వచ్చి పరీక్షలు చేసుకుంటున్నారన్నారు. మిగిలిన వారు రావడానికి ఇష్టపడడం లేదన్నారు. వివిధ కారణాల వల్ల ఏడు మరణాలు చోటుచేసుకోవడంతో గ్రామస్తుల్లో భయం నెలకొందన్నారు. ఏదో జరుగుతుందని ఆందోళన తప్ప ఎటువంటి వ్యాధుల ప్రభావం లేదన్నారు. పరిస్థితి సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ప్రతీ రోజు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. భయంతో ఇతర గ్రామాలకు వెళ్లిన వారు తిరిగి గ్రామానికి వచ్చేలా అవగాహన కల్పిస్తామన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో తాగునీరు, శానిటేషన్ బాగుందని అలాగే నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపిస్తామని తెలిపారు. పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి.శంకర్ ప్రసాద్, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సింధూరం పడాల్, రమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కిండలం గ్రామాన్ని సందర్శించిన కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్నాథం తదితరులు



కిండలం గ్రామంలో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

న్యూస్‌రీల్

బాధ్యతగా పనిచేయండి

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



జడ్డంగిలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

రాజవొమ్మంగి: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వీడి బాధ్యతగా పనిచేయడమే కాకుండా సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన మండలంలోని జడ్డంగి, లాగరాయి పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మార్చి నెలలో పీహెచ్‌సీల ద్వారా రోగులకు అందిన సేవల వివరాలను వైద్యాధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం ఏఎన్‌ఎం, స్టాఫ్ తదితర సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. మందులు, స్టాక్‌రూం, డెలివరీలు, బర్త్‌వెయిటింగ్ రూంలోని రోగుల వివరాలు సేకరించారు. రోజువారీగా పీహెచ్‌సీలకు వస్తున్న ఔట్ పేషెంట్ల (రోగుల) జాబితాను పరిశీలించారు. వైద్యాధికారులు యామినీ ప్రియ, సుజీ, హెల్త్‌ఎడ్యుకేటర్ సుధాకర్, హెచ్‌వీ రమణ, స్టాఫ్‌నర్స్ శిరీష, ఎంఎల్‌పీహెచ్‌ఎస్‌లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కొండందొర (ఫైల్)

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి–రామచంద్రపాలెం మధ్య రోడ్డు మలుపు వద్ద బైక్ అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొని విద్యుదాఘాతానికి గురైన ఘటనలో గిరియువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. జి.మాడుగుల మండలం గెమ్మెలి పంచాయతీ రామచంద్రపాలెం గ్రామానికి చెందిన లకే కొండందొర (25) శుక్రవారం సాయంత్రం గెమ్మెలి గ్రామానికి సొంత పనులు నిమిత్తం వచ్చాడు. తిరిగి స్వగ్రామం రామచంద్రపాలెంకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా రోడ్డు మలుపు వద్ద అదుపుతప్పడంతో రోడ్డుకు సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. దీంతో విద్యుదాఘాతానికి గురైన కొండందొర అక్కడక్కడే మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. అతని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మోదకొండమ్మ ఉత్సవాలకు నేడు పందిరిరాట

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఉత్సవాలకు సంబంధించి పందిరిరాట ప్రతిష్ట కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, తమర్భ ప్రసాద్‌నాయుడు, నవర కొండబాబు తెలిపారు.ఉదయం 8.30గంటలకు పాడేరు మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద, పాడేరు ఎమ్మెల్యే,ఆలయ కమిటీ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నేతలు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, వర్తక సంఘం ప్రతినిధులు పందిరి రాటకు పూజలు చేస్తారన్నారు. అనంతరం ప్రతిష్ట జరుగుతుందని వారు పేర్కొన్నారు.

అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ



అవగాహన కల్పిస్తున్న రేంజర్ కరుణాకర్

గంగవరం: అడవులు మంటల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీశాఖ ఫోక్స్‌పేట రేంజర్ ఎం. కరుణాకర్ తెలిపారు. శుక్రవారం మొల్లేరులోని 'అడవిలో నిప్పు వాటి మనుగడకు ముప్పు' అనే అంశంపై గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో కార్చిచ్చు వల్ల అటవీ సంపద నాశనం కావడమే కాకుండా వన్యప్రాణులకు ముప్పు వాటిల్లనుందన్నారు. భావితరాలకు తీరని లోటుగా మిగలక ముందే ప్రజలు చైతన్యవంతులై జీవవైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. అటవీశాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గిరిజన సెల్ బలోపేతానికి చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి రజని

మహారాణిపేట: కేజీహెచ్ గిరిజన సెల్ బలోపేతం చేసి రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి గిరిజన సెల్‌కు సంబంధించి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజని మాట్లాడుతూ పాడేరు, అరుకులో కొత్తగా బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ గిరిజనసెల్‌కు ఖరీదైన మందులు, కాంట్రాస్ట్ స్కాన్ చేయడానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అంబులెన్స్‌ల సంఖ్యను పెంచాలన్నారు. అరుదైన రక్త నమూనాలకు సంబంధించిన సమస్యలను మంత్రికి వివరించారు. కాన్ఫరెన్స్‌లో కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్, డీఎంహెచ్‌వో జగదీశ్వర రావు, డీసీహెచ్‌ఎస్ డా.రమేష్ కిశోర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మంత్రి దృష్టికి వైద్యపరమైన సమస్యలు: : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్: విశాఖ కేజీహెచ్‌లో గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఎస్టీ సెల్‌ను బలోపేతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజనీని కోరినట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో గిరిజన ప్రాంతంలో వైద్య పరంగా ఎదురవుతున్న సమస్యలను వివరించామని ఆమె పేర్కొన్నారు. కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్‌లో వైద్యపరంగా గిరిజనులకు అనేక సమస్యలు ఎదురవుతున్నందున తగు చర్యలు చేపట్టి పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఎస్టీ సెల్ యొక్క ఉపయోగంపై అవగాహన కల్పించడమే కాకుండా ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరామని ఎమ్మెల్యే తెలిపారు. అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటామని మంత్రి రజనీ హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు.



మంత్రి రజనీతో వీడియో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ఉదయం మంచు.. సాయంత్రం వర్షం



వంతాడపల్లి తోటల వద్ద పొగమంచు



పాడేరులో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పాడేరుతో పాటు సమీప గ్రామాల్లో భిన్న వాతావరణం నెలకొంది. శుక్రవారం వేకువజాము నుంచి ఉదయం 9గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. సూర్యోదయం తరువాత ఎండ కాసినప్పటికి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆకాశమంతా మేఘావృతమైంది. సాయంత్రం నాలుగు గంటల తరువాత అరగంట పాటు భారీ వర్షం కురిసింది.

పంప్డ్ స్టోరేజీపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

సీలేరు: ఏపీజెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించబోయే సీలేరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించి శనివారం నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ పనులను జెన్‌కో ఐడెల్ చీఫ్ ఇంజనీర్ శేషారెడ్డి, జెన్‌కో హెచ్‌పీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీలేరులో రాష్ట్ర ప్రభుత్వం 10 వేల కోట్లతో తొమ్మిది యూనిట్లు ద్వారా 1350 మెగా వాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టును ఇప్పటికే నిర్మించేందుకు డీపీఆర్ తయారు చేయగా అన్ని అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. చివరగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామని, ఈ ప్రాజెక్టు పూర్తిగా అండర్‌గ్రౌండ్ (భూమి అడుగుభాగం)లో జరుగుతుందన్నారు. దీనివల్ల ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు ఉండవని చీఫ్ ఇంజనీర్ సుజయ్‌కుమార్ పేర్కొన్నారు. జెన్‌కో అధికారుల పర్యవేక్షణలో సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో డీఏవో స్కూల్ గ్రౌండ్‌లో ప్రజాభిప్రాయసేకరణకు ఏర్పాట్లు చేశారు.

21 గ్రామాలకు చెందిన గిరిజనులు, ప్రజాప్రతినిధులతోపాటు సీలేరు వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, జెన్‌కో ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా ఎస్పీ ఆదేశాల మేరకు నలుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, సీఆర్పీఎఫ్ ప్రత్యేక బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయి.



ప్రజాసేకరణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జెన్‌కో అధికారులు

రక్తహీనత నివారణే లక్ష్యం

- కిశోర బాలికలకు నేటి నుంచి టేక్ హోం రేషన్
- ఆరోగ్యానికి వరంలా పథకం
- ఏర్పాట్లు చేసిన ఐసీడీఎస్ అధికారులు



పంపిణీ చేయనున్న కోడిగుడ్లు

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లోని బాలికల్లో రక్తహీనత సమస్యను గుర్తించిన ప్రభుత్వం కిశోర బాలికలకు టేక్ హోం రేషన్ ద్వారా పౌష్టికాహారం పంపిణీకి చర్యలు తీసుకుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టేక్ హోం రేషన్ పథకాన్ని ప్రారంభిస్తుండటంతో కిశోర బాలికల ఆరోగ్యానికి వరంలా మారనుంది.

నేటి నుంచి

- ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 14 నుంచి 18ఏళ్ల లోపు కిశోర బాలికలకు ఉచితంగా 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో వంటనూనె, 16 కోడిగుడ్లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.
- జిల్లాలోని 22 మండలాల పరిధిలోని 3214 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. జిల్లాలోని కిశోర బాలికలలో రక్తహీనత సమస్య అధికంగా ఉందని వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న బాలికల్లో ఆరోగ్యకర పరిస్థితులు కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ ఇంటి నుంచి రోజు విద్యాలయాలకు చదువులకు పోతున్న బాలికలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుంది. వారికి రెండో పూట కూడా పౌష్టికాహారం అందించే లక్ష్యంతో టేక్ హోం రేషన్‌ను పకడ్బందీగా పంపిణీ చేయాలని నిర్ణయించింది.
- ప్రధానంగా బాలికల్లో హెచ్‌బీ శాతం పెంచే లక్ష్యంతో ఉంది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతోపాటు టేక్ హోంరేషన్‌తో అదనంగా పౌష్టికాహారం పంపిణీతో కిశోర బాలికల్లో రక్తహీనత సమస్యకు పరిష్కారం ఏర్పడుతుందని ప్రభుత్వం మంచి ఆశయంతో ఉంది.

పౌష్టికాహారం ఇదే

మూడు కిలోల బియ్యం, కిలో వంటనూనె, కిలో కందిపప్పు, 16 కోడిగుడ్లను ఆయా గ్రామాల్లోని 14 నుంచి 18 ఏళ్ల లోపు కిశోర బాలికలకు నెలవారీగా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పంపిణీ చేయనున్నారు.

జిల్లాలో కిశోర బాలికల వివరాలు (14నుంచి 18ఏళ్లు)

ఎస్సీ	ఎస్టీ	మైనారిటీ	బీసీ	ఇతరులు	మొత్తం
823	19	999	90	744	23,051

బడికి దూరంగా ఉన్న కిశోర బాలికలు

1184	07	1191



కిశోర బాలికలు

సర్వేలో అర్హుల గుర్తింపు



జిల్లాలోని అర్హులైన 14నుంచి 18 ఏళ్లలోపు కిశోర బాలికలను సమగ్ర సర్వే ద్వారా గుర్తించాం. ఇళ్ల నుంచి రోజు పాఠశాలలు, పలు విద్యాలయాలకు వెళ్లే బాలికలతోపాటు, డ్రాపౌట్ బాలికలకు టేక్ హోం రేషన్ ద్వారా పౌష్టికాహార పంపిణీని పకడ్బందీగా చేసే లక్ష్యంతో ఉన్నాం. కిశోర బాలికల్లో హెచ్‌బీ శాతం పెంపు, రక్తహీనత సమస్య నివారణకు పౌష్టికాహారాన్ని ఇంటింటికీ అంగన్‌వాడీల ద్వారా పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

– సూర్యలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్, పాడేరు

మునగపాక పంచాయతీ ఈవో సస్పెన్షన్

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక ఎగ్జిక్యూటివ్ అధికారి పి.అజయ్‌బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం మునగపాక మండల పరిషత్‌కు మెయిల్ వచ్చింది. అజయ్‌బాబు గతంలో శ్రీకాకుళం జిల్లాలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసే కాలంలో జరిగిన విషయానికి సంబంధించి ఈ ఉత్తర్వులు వచ్చినట్టు మండల పరిషత్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం అజయ్‌బాబు మునగపాక పంచాయతీ ఈవోగా పనిచేస్తున్నారు. ఆయన సస్పెండ్ కావడంతో తాత్కాలికంగా ఈవోఆర్డీ ఈశ్వరరావుకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న ట్రాక్టర్

డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడ్డ ట్రాక్టర్

చింతపల్లి రూరల్: మండలంలోని కోల్వారి వద్ద శుక్రవారం ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చింతపల్లి నుంచి లోతుగడ్డ జంక్షన్ వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు నిర్మాణానికి రూ.50 వేల విరాళం



గ్రామస్తులకు విరాళం అందిస్తున్న దాతలు

ముంచంగిపుట్టు: జోలాపుట్టు పంచాయతీ తోట గోడిపుట్టు గ్రామానికి సీహెచ్‌డబ్ల్యూ జెమ్మ తన జీతం డబ్బులు వెచ్చించి రహదారి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయం మీడియాలో రావడంతో విజయనగరం జిల్లాకు చెందిన డీఎం కాలేజీ ప్రిన్సిపాల్ నాగభూషణం, రిటైర్డ్ మాస్టర్ వెంకటరావు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో శుక్రవారం తోటగోడిపుట్టు గ్రామానికి విచ్చేసి గ్రామస్తులతో మాట్లాడి రూ.50 వేలు విరాళం అందించారు. సీహెచ్‌డబ్ల్యూ జెమ్మను అభినందించారు. ఆమె సంకల్పం పలువురికి ఆదర్శమని, గ్రామానికి రహదారి నిర్మాణంలో తాము సైతం భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఈ సాయం చేశామని దాతలు తెలిపారు. వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉజ్వల విశాఖ



జీఐఎస్‌కు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం జగన్, రిలయన్స్ అధినేత అంబానీ, జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జున రావు (ఫైల్)



జీ20 సదస్సు కోసం ముస్తాబైన విశాఖ నగరం

- మూడు నెలల్లో నాలుగు కీలక అంతర్జాతీయ సదస్సులు
- వేదికగా నిలిచిన మహా నగరం
- పెట్టుబడుల సదస్సుతో వాణిజ్య కేంద్రంగా వైజాగ్
- తీపి జ్ఞాపకాలనందించిందన్న జీ20 దేశాల ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : పరిపాలన రాజధానిగా కాబోతున్న నేపథ్యంలో వైజాగ్.. అంటే ఓ బ్రాండ్ ఇమేజ్ అన్నట్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్రెండ్ సెట్ చేశారు. మూడు నెలల వ్యవధిలో నాలుగు అంతర్జాతీయ సదస్సులకు వేదికగా నిలిచి... ప్రతి సదస్సును విజయవంతంగా నిర్వహించిన విశాఖ నగరం.. దేశ విదేశీ ప్రతినిధుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంది. ఐటీ సదస్సులతో టెక్నాలజీ ఐకాన్ సిటీగా పేరొందిన నగరం.. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయవంతంగా నిర్వహించిన తర్వాత పెట్టుబడులకు స్వర్గధామంగా మారగా.. నాలుగు రోజుల పాటు నిర్వహించిన జీ20 సదస్సుతో అందరి నోటా ఒకే మాట.. దేశానికి ఆర్థిక కోట.. విశాఖ.. అనే ఇంటర్నేషనల్ బ్రాండ్‌ను సొంతం చేసుకుంది. నాలుగు రోజుల పాటు ఆతిథ్యమిచ్చిన వైజాగ్.. మంచి జ్ఞాపకాల్ని అందించిందంటూ విదేశీ ప్రతినిధులు చెబుతుండటం విశేషం. అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి నగరాల్లో అగ్రభాగంలో ఉన్న విశాఖపట్నంలో ఏ సదస్సు నిర్వహించినా.. సూపర్ సక్సెస్ అవుతుందన్నది మరోసారి నిరూపితమైంది. ప్రణాళికా బద్ధంగా నిర్మితమైన నగరంగా విశాఖకు జీ20 సదస్సు నిర్వహణతో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా.. కానరాని ఇమేజ్.. ఈ ఏడాది నిర్వహించిన సదస్సులతోనే సొంతం చేసుకుంది. జీఐఎస్‌తో వైజాగ్ పేరు ఖండాంతరాలు దాటగా జీ20తో విశ్వవ్యాప్తమైంది. ఈ ఏడాది తొలినాళ్లలో రాష్ట్ర ప్రభుత్వం, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ(ఐటాప్) ఆధ్వర్యంలో 'ఇన్ఫినిటీ వైజాగ్' సదస్సు నిర్వహించారు. అనంతరం గ్లోబల్ టెక్ సమ్మిట్ జరిగింది. ఈ రెండు సదస్సులకు 40కి పైగా దేశాలకు చెందిన విదేశీ ప్రతినిధులు హాజరై వైజాగ్ సిటీ వైభవాన్ని చూసి ముగ్ధులయ్యారు. వైజాగ్.. ఐటీ రంగానికి డెస్టినేషన్ అని కొనియాడారు.

జీఐఎస్‌తో కొత్త ఇమేజ్..

రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించిన తర్వాత నగరానికి సరికొత్త ఇమేజ్ వచ్చింది. విశాఖపట్నం సమగ్రాభివృద్ధి చేసేందుకు ఎంతో అవకాశం ఉన్న నేపథ్యంలో ఎవరు వచ్చినా ఆహ్వానించదగ్గ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న నగరంలో తమ వ్యాపార కార్యకలాపాలు విస్తరించాలన్న ఆలోచనలు పారిశ్రామికవేత్తలు స్వయంగా చూసిన తర్వాత రూఢీ చేసుకున్నారు. నివాస యోగ్య నగరాల్లో టైర్-1 సిటీలతో పోటీ పడుతున్న విశాఖపట్నం పెట్టుబడులకు కూడా ప్రధాన కేంద్రంగా మారింది. అంతర్జాతీయ సంస్థలు కూడా విశాఖ జిల్లాలో తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ముందుకొచ్చాయంటే దీనికి కారణం.. వైజాగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అన్నది జగమెరిగిన సత్యం.

జీ20తో అంతర్జాతీయ ఖ్యాతి

భిన్న వాతావరణం, విభిన్న సంస్కృతులు, మెచ్చే భాషలు, ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖపట్నం వైపు చూసేలా చేస్తున్నాయి. జీఐఎస్ విజయవంతం అనంతరం నాలుగు రోజుల పాటు జరిగిన జీ20 సదస్సు అద్భుతంగా జరిగింది. నగరాల అభివృద్ధి, ఆర్థిక పురోగతి, నిధుల సమీకరణ తదితర అంశాలపై సెషన్లు నిర్వహించారు. అనంతరం నగర పర్యటనలో భాగంగా జీ20 దేశాల ప్రతినిధులు నగర సందర్శన చేశారు. నగర అభివృద్ధికి చిహ్నంగా వినూత్నంగా ప్రాజెక్టులు నిర్వహించడాన్ని విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. మార్చి 28న సదస్సు ప్రారంభం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై.. విదేశీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. విశాఖ నుంచి వెళ్లేటప్పుడు మధురమైన జ్ఞాపకాల్ని తీసుకెళ్తారని సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లుగా.. జీ20 సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ.. అదే ఫీలింగ్‌తో బయలుదేరారు. సదస్సు విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించిన జిల్లా అధికారయంత్రాంగం, పోలీసులకు కలెక్టర్ డా.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖ-రాయగడ సెక్షన్‌లో తనిఖీలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-రాయగడ సెక్షన్ పరిధిలో వాల్తేర్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి శనివారం విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు. ఆయా స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. అభివృద్ధి పనులపై సమీక్షించారు. రాయగడలో కొత్తగా నిర్మిస్తున్న స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. జిమిడిపేటలో కొత్తగా నిర్మించిన సబ్ సెక్షన్ పోస్ట్, రాయగడలో కొత్తగా నిర్మించిన రెండు 500 కేవీ సబ్‌స్టేషన్లను ప్రారంభించారు. ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కో ఆర్డినేషన్ పి.కె.మహారాణా, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్ర తదితరులు పాల్గొన్నారు.

బంద్‌తో స్తంభించిన ఏజెన్సీ



వై.రామవరంలో ఆదివాసీ జేఏసీ నాయకుల మానవహారం



జీకే.వీధిలో బంద్ సందర్భంగా పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ అశోక్‌కుమార్

సాక్షి నెట్‌వర్క్: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు శాసనసభలో చేసిన తీర్మానాన్ని విరమించుకోవాలని శుక్రవారం చేపట్టిన బంద్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రోడ్లపై ఆందోళనలు, రాస్తారోకోలు, నిరసనలు గిరిజన లోకం చేపట్టింది. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలను ఆందోళన కారులు పని చేయనివ్వలేదు. పలు చోట్ల పోలీసులకు, గిరిజన నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రంపచోడవరం ఐటీడీఏ వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానం విరమించుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు.

రామయ్య చేతికి రాజ్యాధికారం

- నేత్రపర్వంగా సుందర సీతారామచంద్ర స్వామి పుష్కర పట్టాభిషేకం
- రామనామస్మరణతో మార్మోగిన శ్రీరామగిరి

వీఆర్‌పురం: శ్రీరామగిరి అంతా రామనామ స్మరణతో మార్మోగింది. ఇక్కడ సుందర సీతారామచంద్ర స్వామివారి కల్యాణ వేడుక తదుపరి ఘట్టం నేత్ర పర్వంగా జరిగింది. శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి పుష్కర పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. కొండ మీద ఆలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతా సమేత రామచంద్రస్వామి వారిని దేవరాజ వాహనంపై ఊరేగింపుగా కొండ కింద కల్యాణ మండపానికి తీసుకువచ్చి పట్టాభిషేకం చేశారు. రామచంద్రుడికి తప్ప మరే ఇతర దైవ స్వరూపానికి పట్టాభిషేక వేడుక లేదని ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు వివరించారు. మహా పట్టాభిషేకాన్ని 60 ఏళ్లకొకసారి, పుష్కర పట్టాభిషేకాన్ని ప్రతీ 12 ఏళ్లకొకసారి నిర్వహిస్తామన్నారు. పుష్కర పట్టాభిషేకంకానికి హాజరైన భక్తులు వీక్షిస్తుండగా సర్వాలంకరణాభూషితుడైన సుందర సీతారామచంద్ర స్వామికి కిరీటాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం అలంకరించారు. జానకీరాముడికి మళ్లీ రాజ్య పాలన అప్పగించి ఆయన చల్లని పాలనలో ప్రజలు ఆనందంగా జీవనం సాగించాలని ఈ వేడుక నిర్వహిస్తారని తెలియజేశారు. ఆలయ చైర్మన్ రేవుబాలరాజు, దేవదాయ శాఖ అసిస్టెంట్ సాయి బాబు పాల్గొన్నారు.

మూడు బైక్‌ల దగ్ధం

నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

కొయ్యూరు: గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాజేంద్రపాలెం రామకృష్ణ మెకానిక్ షాపు బయట ఉంచిన మూడు బైక్‌లకు నిప్పు పెట్టారు. రెండు రోజుల కిందట మూడు బైక్‌లను రిపేర్ చేయాలని మెకానిక్ రామకృష్ణకు ఇచ్చారు. ఆయన వాటిని రిపేర్ చేసేందుకు షాపు బయట ఉంచారు. ఇంతలో వాటిని తగులబెట్టారు. అవి కాలిపోతున్న విషయాన్ని స్థానికులు షాపు యజమానికి చెప్పడంతో వెంటనే ఆయన వచ్చిన మంటలార్పారు. వెంటనే అప్రమత్తం కావడంతో షాపు లోపల మరో నాలుగు బైక్‌లకు మంటలంటుకోలేదు.

కాలిపోయిన బైక్‌ల విలువ రూ.లక్ష దాటి ఉంటుందని బాధితుడు చెబుతున్నాడు. కొయ్యూరు ఎస్ఐ రాజారావు శుక్రవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులపై కోపంతో వాటిని తగులబెట్టారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. వర్తక సంఘం నేత చక్రరావు కాలిపోయిన బైక్‌లను పరిశీలించి బాధితుడిని ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని కోరారు. ఇటీవల బాధితుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులదే

- విద్యాశాఖ డైరెక్టర్ ప్రసన్నకుమార్



రమేష్‌బాబు దంపతులను సన్మానిస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు, గ్రామస్తులు

నక్కపల్లి: విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందని విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ (లైబ్రరీస్) ఎంఆర్ ప్రసన్నకుమార్, మిడ్‌డే మీల్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలో చినరామభద్రపురంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాయి రమేష్‌బాబు స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సందర్భంగా శుక్రవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన పౌరసన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. రమేష్‌బాబు ఉపాధ్యాయ వృత్తితో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకు వస్తూ న్యాయమైన పరిష్కారం కోసం తపన పడేవారన్నారు. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేస్తున్న రమేష్‌బాబును అభినందించడానికి నియోజకవర్గం నలుమూలల నుంచి ఆయన అభిమానులు, సహచర ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు వచ్చారంటే ఆయన వ్యక్తిత్వం ఎటువంటిదో తెలుసుకోవచ్చన్నారు. యూనియన్లను సమన్వయం చేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై తమదైన శైలిలో పరిష్కారానికి కృషి చేసేవారని ఉపాధ్యాయ సంఘ నేతలు గోపీనాథ్, సూకరాజు, వెంకటరావు, చలపతిరావు తదితరులు కొనియాడారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛంద పదవీ విరమణ అనంతరం రమేష్‌బాబు ఎంచుకున్న రంగంలో ఆశించిన స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సన్మానగ్రహీత రమేష్‌బాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన ఉన్నతాధికారులు, సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో మహాలక్ష్మమ్మ, ఎంపీపీలు ఏనుగుపల్లి రత్నం, ఇసరపు పార్వతి తాతారావు, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, గాంధీ, సర్పంచ్‌లు గారా ఉషశ్రీప్రసాద్, రాఘవకుమారి, దండు బలరామరాజు, దేవర సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, జి.నర్సింహమూర్తి, సఖిరెడ్డి రమణ, వెంకట్రావు, వి.చంటి తదితరులు పాల్గొన్నారు.

వారిద్దరూ తోడు దొంగలు

- ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబు, రామోజీరావు
- కేసుల్లో ఇరుక్కున్నపుడే దళితులు గుర్తొస్తారు
- చట్టం నుంచి ఇద్దరూ తప్పించుకోలేరు
- అసెంబ్లీకి రానివాడు ప్రతిపక్ష నేత ఎలా అవుతాడు
- మంత్రి మేరుగ నాగార్జున విమర్శలు

నక్కపల్లి: చంద్రబాబునాయుడు, రామోజీరావులు తోడు దొంగలని, ఇద్దరికీ కేసుల్లో ఇరుక్కున్నప్పుడే దళితులు గుర్తొస్తారని, వారిని అడ్డంపెట్టుకుని రాజకీయం చేసి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తుంటారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆరోపించారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాల్సిన రూ.375 కోట్ల ప్రభుత్వ ధనాన్ని చంద్రబాబునాయుడు తన ఖాతాల్లోకి జమ చేసుకున్నారన్నారు. నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఈ విషయం సీఐడీ విచారణలో వెల్లడయిందన్నారు. ఇక చంద్రబాబు మార్గదర్శి చీటీల పేరుతో వందల కోట్ల ప్రజాధనాన్ని తన వ్యక్తిగత, ఇతర వ్యాపార సంస్థల ఖాతాల్లోకి వేసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఇద్దరి అవినీతి బాగోతం ఇటీవల దర్యాప్తు సంస్థల విచారణలో వెల్లడయిందన్నారు. వీరిద్దరూ చట్టాలకు అతీతులుగా చెప్పుకుంటారని, శిక్షల నుంచి తప్పించుకోవడానికి, ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఏదో ఒక అంశంపై రాద్ధాంతం చేసి జగనన్న ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మార్గదర్శి వ్యవహారాన్ని, స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి బాగోతం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు చంద్రబాబు, రామోజీలు కలిసి రాష్ట్రంలో దళితులపై హత్యలు పెరిగిపోతున్నాయంటూ రాద్ధాంతం ప్రారంభించారన్నారు. వీరికి కేసుల్లో ఇరుక్కున్నపుడు కష్టం వచ్చినపుడే తమ అవినీతిని కప్పిపుచ్చుకునే సమయంలోనే దళితులు గుర్తొస్తారన్నారు. అసెంబ్లీకి రానివాడు ప్రతిపక్ష నేత ఎలా అవుతాడని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు అసెంబ్లీకి రానని శపథం చేసి తన చెంచాగాళ్లతో శాసన సభలో దాదాగిరి, గూండాగిరి చేయించి ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులపై చర్చ జరగకుండా అడ్డుకున్నాడని ఆరోపించారు. గతంలో చంద్రబాబు సర్కారు హయాంలో కూడా ఇలాగే వ్యవహరించారన్నారు. కాల్‌మనీ కేసుల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ఇరుక్కుపోతే దానిపై అసెంబ్లీలో ప్రతిపక్ష వైఎస్సార్‌సిపి సభ్యులు చర్చకు పట్టుబట్టారని.. అంబేద్కర్ అంశాన్ని తీసుకు వచ్చి కాల్‌మనీ అంశం చర్చకు రాకుండా పక్కదారి పట్టించారని మండిపడ్డారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రంపాలెం విద్యార్థుల ప్రతిభ

మధురవాడ (భీమిలి): చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన పోటీలతో పాటు ప్రైవేటు సంస్థలు నిర్వహించిన పోటీల్లో కూడా తమదైన శైలిలో సత్తా చాటుకుంటున్నారు. ఇటీవల డబ్ల్యూఎస్ఎస్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ఫోకస్ ఆన్ సైన్స్ అనే అంశంపై నిర్వహించిన ఆన్‌లైన్ పోటీలలో పదో తరగతికి చెందిన జి.రాజశేఖర్, ఆర్.వినయ్ తేజలు ప్రథమ స్థానంలో నిలిచి గ్లోబల్ చైల్డ్స్‌గా ఎంపికయ్యారు. 13 దేశాలకు చెందిన వివిధ పాఠశాలలు విద్యార్థులు పాల్గొన్న పోటీలలో విశేష ప్రతిభ కనబరిచారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

భర్త చేతిలో భార్య హతం

- చున్నీ మెడకు చుట్టి ఘాతుకం
- రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం



నాగమణి (ఫైల్)

రంపచోడవరం: అన్యోన్యంగా సాగిపోతున్న వారి దాంపత్య జీవితంలో అనుమానమే పెనుభూతమై చిచ్చుపెట్టింది. దాంతో కోపోద్రిక్తుడైన భర్త తన భార్య మెడకు చున్నీ చుట్టి చంపేశాడు. ఆపై గుట్టుచప్పుడు కాకుండా జలాశయంలో మృతదేహాన్ని పడేశాడు. శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసిన ఈ అమానవీయ సంఘటన రంపచోడవరంలో చోటు చేసుకుంది. ఇక్కడ సాయినగర్‌లో నివాసం ఉంటున్న పిల్లా శివకృష్ణకు నాగమణి(32)తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిందితుడు ఏపీ ట్రాన్స్‌కోలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు తరుచూ గొడవ పడేవారు. దీంతో కోపోద్రిక్తుడై అతడు ఇంట్లోనే ఆమె మెడకు చున్నీ చుట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని గోనె సంచితో కట్టి గంగవరం మండలం సూరంపాలెం రిజర్వాయర్‌లో పడేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్టు ఎప్పటి మాదిరిగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో తన కుమార్తె మూడు రోజులుగా కనిపించడం లేదని తల్లి గుబ్బాలమ్మ గత నెల 30న రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా భర్త శివకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో జరిగిన విషయాన్ని బయట పెట్టాడు. ఈ మేరకు ఎస్సై మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం జలాశయంలో గాలించగా నాగమణి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని శవపరీక్ష కోసం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.